కథానిక

# జనరల్ ఎలెక్షన్

పి. ఆర్. రామానుజాచార్యులు

"ప్రజలందరికీ అన్ని సౌకర్యాలు చేకూర్చడము, ప్రజల కష్టాలే నా కష్టాలుగా భావించడం ముఖ్యంగా నా విధి. నేను ప్రభుత్వంలోకి వచ్చినట్లయితే రామరాజ్య పద్ధతులు అమల్లో పెడతాను" అని "ఎలెక్షన్ మ్యానిఫెస్టో" ప్రకటించి ప్రచారం నిమిత్తం బయలుదేరాడు రవీంద్రరావు. వెనకటిరోజుల్లో మత ప్రచారంకోసం తిరిగేవాండ్లు గ్రామఫోనులు కొత్తగా వచ్చినందున అది వకటి తీసుకొని పల్లెటూళ్ళకుపోయి ముందు రెండు రికార్డులు పెట్టి పాడించగానే జనం చేరుతూండే సంగతి తెలిసినవాడైనందున అలా చేయడానికి ప్రస్తుత కాలంలో గ్రామఫోనులు పని చేయవని నిశ్చయించుకొన్నాడు. ఆకర్షణీయంగా వుండే కారు కొన్నాడు. దానిలోనే ఆంప్లిఫైర్ సెట్టు, మైక్ యేర్పాటు చేసుకొన్నాడు. కారులో పోయినంతసేపూ దోవలో యేజెంటు చెబుతూండడం, వూళ్ళోకిపోయినాక సమావేశం యేర్పాటుచేసి తన ఆశయాలు వివరించడం అనే కార్యక్రమం నిశ్చయం చేసుకొని కాఫీ ఫ్లాస్కు వగైరాలతో బయలుదేరాడు. చెప్పవలసిన వుపన్యాస పాఠం యింటివద్దనే వ్రాసుకొని కంఠతః వల్లించి యెక్కడా తడువుకోకుండా యేకధాటిగా జనం నివ్వెరపొయ్యేటట్లు చెప్పడానికి నిర్ణయించుకొని కొంతసేపు హెచ్చు స్థాయిలోనూ, కొంతసేపు తగ్గు స్థాయిలోనూ, ప్రజలను వేడుకొనేటప్పుడు చూపవలసిన భక్తిని, వున్న ప్రభుత్వాన్ని విమర్శించేటప్పుడు పెట్టవలసిన పోజు వగైరాలు, పదిహేను రోజులపాటు యింటివద్దనే రిహార్సలు చేసుకొని తరిఫీదు అయి బయలుదేరడంవల్ల ప్రతిచోటా సలక్షణంగానే ప్రచారం జరిగిపోతూంది. అదిగాక యిదివరకు నాటకాల్లో వేసివున్నవాడవడంచేత మధ్యమధ్య రాయబారం వగైరాల్లోని పద్యాలు చదవడం, ఆడవేషంలోని తళుకులు బెళుకులతో ప్రజల "వన్స్‌మోర్"లతో ఆడవారికి ఆడవారు, మగవారికి మగవారు, యాక్టర్లకు యాక్టర్లు హోయి అనడం- ఇటువంటి కాండిడేటు మనకు లభించడం గొప్ప విషయం, ఇలాంటివాడిని శాసనసభలకు పంపితే యెంతైనా ప్రయోజనం వుంది గాని, వట్టిపోరు తెరవలేని దద్దమ్మలంతా పోతే కుర్చీలు ఖాళీలేకుండా కూచోడానికే పనికి వస్తారనడం మొదలు పెట్టారు.

ఈ హడావిడంతా చేస్తూ ప్రజలను మోసగిస్తున్నాడని శివశంకరానికి అసూయ కలిగింది. వున్న విషయాలు వున్నట్లుగా యథార్థం ప్రజల యెదుట పెట్టితే వారే నిర్ణయించుకొని తమ వోట్లు యెవరికి యివ్వవలసిందీ తేల్చుకొంటారని తన పార్టీ ప్రచారానికి మొదలుపెట్టాడు. ఇంటివద్ద బట్టీపెట్టి వల్లించిన వుపన్యాసం కాకపోవడంతో మధ్యమధ్య తడువుకోడం, మరచిపోయిన విషయాలు జ్ఞాపకం చేసుకోడం తటస్థపడుతూంది. యథార్థవాదీ లోకవిరోధీ అన్నట్లు యీయన నిజమైన విషయాలే చెబుతున్నాడు గాని రక్తికట్టడంలేదు. అని చప్పరించడం మొదలుపెట్టారు. ఎలెక్షన్ రోజులు కాబట్టి వచ్చేవాండ్లలో యీయన ఒకడని జమకట్టారు. రోజుమార్చి రోజైనా ఏదో వక పార్టీవాండ్లు వచ్చి సభలు యేర్పాచేయడంతో పల్లెటూళ్ళలో గూడా డబ్బు ఖర్చులేకుండా కాలక్షేపాలు జరిగిపోతున్నాయి. ఏ హరికథో, పాట కచేరో, వీధినాటకమో, తోలు బొమ్మలాటో అయితే డబ్బు ఖర్చు చమురు ఖర్చూగూడా గ్రామస్థుల నెత్తిన్నే పడేది. అది తప్పిపోయిందిప్పుడు. ఓట్ల సంగతి దేముడెరుగ్గాని బలే మజాగా వుందిరా అనుకొనేవాండ్లుగూడా లేకపోలేదు.

ఇంతలో సూర్యారావుపార్టీ ప్రచారానికి బయలుదేరింది. ప్రజల బుర్రలకు విషయాలు చక్కగా ఎక్కించినప్పుడే తన పార్టీ గెలవడానికి అవకాశాలున్నాయనే పద్ధతి ప్రధానంగా పెట్టుకొన్నాడు. చక్కని ఆర్కెస్ట్రా యేర్పాటు చేసుకొన్నాడు. ఒక చక్కని సినిమా స్టారును కూడా వుంచుకొని వుపన్యాసాల మధ్యలో అప్పుడప్పుడూ నాలుగు సాంగ్సు పాడించడం కొద్దికొద్దిగా డ్యాన్సు రుచి చూపడంతో చూచేవారికి నాటకాల లోటు కూడా తీరి హాయి అనిపించింది. ఒక్కొక గ్రామంలో పురజనుల కోరికపై మరుసటిరోజు కూడా ఎలెక్షన్ ప్రోపగాండా జరగడంతో యికమీద యింట్లో కాలిమీద కాలు వేసుకొని కూర్చున్నా వోట్లవిషయంలో ఢోకా లేదనుకొన్నాడు సూర్యారావు.

నైతిక కాంగ్రెసు ప్రచారానికి బయలుదేరిన నారాయణమూర్తి క్రొత్తరకం ప్రచారం మొదలు పెట్టాడు. అదేమంటే "ప్రజలు మీరంతా స్వతంత్రులు కొబట్టి యీ వచ్చి చెప్పేవాండ్ల మాటలను మోసపోకుండా వుండండి. వయోజన వోటింగు అమలులోకి వచ్చిన వయోజన విద్యా ప్రచారంతో మీరంతా విద్యావంతులైనందువల్ల ప్రతి ప్రచారకుణ్ణి జవాబుదారీ గల ప్రశ్నలు వేసి వారు ప్రజలకు చేస్తామనే పనులకు పూచీ యేమిటో తెలుసుకోవడం, అట్లా అనుకున్న టైములోపల చేయకపోతే జన్మఖైదు గాని, ద్వీపాంతరవాస శిక్షగాని, ఉరిశిక్ష గాని విచారణ లేకుండా విధించేటట్లు ఖరారు నామాలు వ్రాతపూర్వకంగా జరిగే యేర్పాటు చేసుకొనండి. అని వాళ్ళకు కొన్ని బందోబస్తయిన ప్రశ్నలు నేర్పించి పోయినాడు. దాంతో ప్రజలలో క్రొత్తమార్పు బయలుదేరింది.

ఆరోజు మొదలుకొని ప్రచారానికి వచ్చే వాండ్లను ప్రతివూరా, "ప్రజలందరూ స్వతంత్రులనిన్నీ మీరు ప్రజాసేవకులని చెబుతున్నారు కొబట్టి మేమందరము ఎత్తైన ప్రదేశములలో కూర్చుంటాము. మీరు క్రింద నిలబడి చేతులు కట్టుకొని మీ విషయాలు మనవి చేసుకో వలసినది మొదటి విధిగాను, మేము అడిగిన ప్రశ్నలకు ఖచ్చితమైన జవాబులు చెప్పడం రెండవ విధిగాను మీరు భావించాలి" అని మొదలుపెట్టటడంతో విప్లవం బయలుదేరింది. ఈ షరతులకు వొప్పుకున్నవారే వుపన్యాసం చెప్పడానికి సిద్ధపడ్డారు. దీంతో "విత్ డ్రా" చేసుకొనె క్యాండిడేట్లు బయలుదేరారు. ఈ సందర్భంలో ఒక పార్టీ నాయకుడు వుపన్యాసం చెబుతూంటే ముఖంలో దీనత్వం తాండవిస్తూంది. ఎత్తైన బల్లలమీద టూకుటీకుగా రొమ్ము విరుచుకొని చెప్పే పద్ధతి పోవడంతో యాచకుల మొగాలలో తాండవించే బానిసత్వ లక్షణాలు పొడచూపాయి. ఆలోచించుకుంటూంటే వ్యక్తి స్వాతంత్ర్యమనేది యేమూలా మనిషిలో కనబడం లేదు. "ఇంతమంది ప్రజలలో నేను కూడా స్వతంత్రుణ్ణే గదా! క్రింద పాదాలవద్ద నిలుచుని బానిసమాదిరిగా చేతులు కట్టుకొని ముష్టి అడిగినట్లు అడగవలసివచ్చిందే" అని మనస్సులో కలిగే దుఃఖాన్ని ఆపుకోలేక పోవడంతో మరీ నీరసించి కంఠస్వరం కూడా మరీ హీనమై పోసాగింది. కాని కొంచెం ధైర్యం తెచ్చుకొని అలిసిపోయినట్లు నటించి యీ సమయంలో టీ త్రాగితే కొంతసేపు హుషారుగా వుంటుందని రెండు కప్పులు తెప్పించుకొని గుండె సవరించుకొని ఒక ఛాన్సు చూస్తాం. పాచికపారక పోతుందా అనుకొని ప్రారంభించాడు.

"ప్రజలారా! ఇప్పటికి మనకుస్వతంత్రం వచ్చి నాలుగు సంవత్సరములకు పైగాఅయింది. ఈ రోజువరకూ ప్రజలు తిండికీ, గుడ్డకూ మొగం వాచిపోతున్నారు. ప్రభుత్వం "అది చేస్తున్నాము, ఇది చేస్తున్నా"మని చెప్పడమే గాని పట్టి విస్తరి మంచినీళ్ళే గతయింది. ఓట్లు తీసుకొనేటప్పుడు చెప్పిన వాటిని సీట్లమీద కూర్చున్న తర్వాత మరిచిపోయినారు. అధికారులకు లంచాలు, వ్యాపారస్థులకు బ్లాక్ మార్కెట్లు, సకుటుంబ సపరివార సమేతంగా మంత్రులకు పర్మిట్లు, ప్రజలకు అగచాట్లు మామూలైపోయినవి. ఇలాంటి ప్రభుత్వమే కొద్దిరోజులు వుంటే ప్రజల శక్తి సామర్థ్యాలంతా అటుగంటిపోయి చైతన్యం కూడా నశించే

రోజులు రాకమానవు. అందువల్ల ప్రజల కష్టములు చూచి సహించలేని మేము ప్రజలకు సౌకర్యములు చేయడమే ప్రధాన ఆశయంగా పెట్టుకొని మీ యెదుటికి వచ్చి మీ ఓట్లను యాచించుచున్నాము. మన దేశంలో భిక్షం అడిగితే లేదనే పద్ధతి లేకుండా వుండడం మన జాతీయతకు ముఖ్య లక్షణం. మీ పవిత్రమైన వోటును మాకే యిచ్చి మా పార్టీని గెలిపించినట్లయితే ప్రభుత్వమును చేబట్టి మీ కోర్కెలు నెరవేరుస్తామని ప్రతిజ్ఞ చేయుచున్నాను. ఇట్లు విన్నవించుకొను మీ విధేయుడను క్షమింతురుగాకని యింతటితో ముగించుచున్నాను. మీ ప్రశ్నలకు జవాబు చెప్పవలసిన విధి నాయందున్నది. కాబట్టి అడగవలసినదిగా కోరుచున్నాను."

ప్రజలు: మా వోటు పవిత్రమైనదని చెప్పారుగదా? ఎట్లా పవిత్రమైనది? ఎంత వరకు? పెట్టెలో వేసేవరకేగదా?

అభ్యర్థి: మీ ఓటువల్లనే మామూలు వ్యక్తిని రాజుగా చేయగలరు. ప్రజలందరూ సౌఖ్య జీవనము చేయడంకంటే పవిత్రమైన కార్యము లేదు కాబట్టి, మానవ సేవే మాధవ సేవ అయినందున, అట్టి పవిత్ర కార్యమును మాకు యేర్పాటుచేసే హక్కు మీ వోటులోనే యిమిడివుండుటచేత అది పవిత్రమైనదని చెప్పుటకు వేరే తార్కాణ మక్కరలేదు.

ప్ర: అంత శక్తే మీ వోటుకు వుంటే పెట్టెలో వేసిన మరుక్షణంనుంచే మా దిక్కు మాదిగానే వుండి విచారించే దిక్కులేక మా కాళ్ళమీద మేము నిలబడవలసిన అగచాట్లకు కారణమేమి? వోట్ల కొరకు కాళ్లుకింద పెట్టనీయకుండా బుజాలమీదనైనా యెక్కించుకో పోవడానికి సిద్ధపడి ఓటు పెట్టెలో పడినంతనే మనిషి కనపడకపోవడంతో కాలుకాలు కొట్టుకొంటూ కొంప చేర్తారే ఓటర్లు? ఇదంతా చూస్తే పవిత్రంగా కన్యాదానం పిల్లను అంపకాలు చేసి, దుఃఖంతో వెనక్కు తిరిగివచ్చినట్లు వుంటుంది. బిడ్డను మళ్ళా అప్పుడప్పుడూ పుట్టింటికి తెచ్చుకొని చూచుకునే యోగ్యతైనా వుంటుందిగాని యిది అట్లాగాకుండా స్వతంత్రము సంపూర్ణముగా మీకు వప్పజెప్పి నిర్జీవ ప్రతిమల మాదిరి నిలబడవలసిందేగదా? రాజులను చేసే శక్తి మంత్రులనుజేసే శక్తి గనక మా వోటులోనే వుంటే ఆవోటుతో మేమే రాజులుగాని, మంత్రులుగాని, కనీసం ధనవంతుడుగాగాని కాగూడదా? మాకుండేది మీకిచ్చి అవస్థపడడం సొంతయిల్లు అద్దెకిచ్చి అద్దెయింట్లో అవస్థపడడం మాదిరిగా వుంది.

అ:— మీరు చెప్పినది నిజమే. ఒక వుదాహరణ చూడండి. పూర్వం సద్బ్రాహ్మణులు ఆశీర్వాద మంత్రాలతో ధాన్యము, ధనము కలుగునట్లు దీవించితే ఆమాదిరి కలుగుతాయని అభిప్రాయం. ఆ దీవించినదానికి తృణమో, పణమో ముట్టజెప్పటం ధర్మంగా వుండేది. అట్లాగాకుండా ఆ అక్షింతలు వారినెత్తినే వేసుకొని వారే ధనధాన్యములతో తులతూగితే బాగుండునుగదా? ఎదుటివారిని ధనికులనుజేసి తాము బీదతనం అనుభవిస్తారుగదా. దానికి కారణం ఆ మంత్రములు యితరులను సౌఖ్య పెట్టునవేగాని తమనెత్తిన వేసుకొనుటకు వుపయోగపడవు. ఆ మంత్రములు పరోపకారమే సూచించుచూ పవిత్రములుగా వెలసినట్లే మీ వోట్లుకూడా పవిత్రమైనవి. కత్తి వగైరా ఆయుధములు యితరులమీద వుపయోగించుతారేగాని తమపైననే వుపయోగించుకొంటే ఫలితం దుష్ఫలితమేగదా! అట్లే తనకుమార్తెను తగిన వరునకిచ్చి కన్యాదానముజేసి పవిత్రమైన కన్యాదానముచే కలుగు ఫలము అనుభవించవలెనేగాని తన ధనమును, ధాన్యమును, యింటిని వాడుకున్నట్లు తన పుత్రికను అనుభవించిన ఫలితము దుష్ఫలితమేగదా? తన స్వంతవస్తువులయినప్పటికీ తను వాడుకోదగినవి, విధిగా ఇతరులకు ఇవ్వవలసినవి వేరువేరుగా వుండును. నా రూపాయేగదా యితరులకు యివ్వను, నా రూపాయి నేనే వాడుకుంటాను అంటే వీలున్నదా? ఇతరులకు యిస్తేగాని తనకు అనుకూలమైన వస్తువు లభించదు. అట్లే మీవోట్లు ఎవరికో ఒకరికివ్వక తప్పదు. మీవద్ద వుంచికొన్ననూ నిష్ఫలమే. కన్యాన్వేషణకుగా అనేకులు వత్తురు. మంచి వరుని జూచి యిచ్చినట్లే మంచి పరిపాలన జేసేవారికి మీవోటు యివ్వవలెను.

ప్ర: మీరు బాగా పాలిస్తారని గుర్తేమిటి? ఇదివరకు పాలించారా? లేక మీరు వంశపరంపరగా పరిపాలనా దురంధరులా? కొంతకాలం పాలించినవారికే చేతకానిది కొత్తగా వచ్చే మీరు మాత్రం ఎట్లా చేయగలరు?

అ: మేము చేస్తామని గ్యారంటీగా చెబుతున్నాము కాబట్టి యీసారి మా పరిపాలనా చూడండి. మేముగూడా అదే మాదిరైతే మమ్ములను దించి వేరొకరిని యేర్పాటు చెయ్యండి.

ప్రజ: మీరు చేయకపోతే యింకొకరు, వారు చేయకుంటే మరియొకరు, వారూ చేయకపోతే వేరొకరు యింతేగా మాగతి. "పాత మొగుడు బాగాలేడని కొత్తమొగుణ్ణి కోరుకున్నట్టు వుంటుంది. ఇతర దేశస్థులకు వేరే మొగుణ్ణి ఎన్నుకొనే ఆచారంవుంది. అలాగే వేరే ప్రభుత్వాన్నిగూడా. అంతేగాని మన దేశానికి అది తగదు. కట్టుకొన్న మొగుడితో కష్టపడడం ఆచారం. అట్లా కాదంటూరా కొత్తవాడు వస్తే సంపూర్ణ సౌఖ్యమైనా వుండాలి. వ్రతం చెడ్డా సుఖం దక్కాలి. అట్లాగాక యింటికూటికీ దోవకూటికీ రెంటికీ చెడ్డట్టవుతుంది. ఆడబిడ్డను అత్తవారింటికి పంపినతర్వాత అవసరమైనప్పుడు పుట్టింటికి తెచుకొనే అధికారమన్నా వుంటుందిగాని మీకు వోటిచ్చి పంపితే మళ్లీ దించేపద్ధతి ఎట్లావుందో యిప్పుడు చూస్తున్నారుగా.

అ: ఒక్కొక్క అల్లుడు మంచివాడు గాక బిడ్డను కష్టపెట్టడం, పంపకపోవడం జరగవచ్చుగాని, అల్లుడు అనేవాడంతా అట్లా వుంటాడనడం సమంజసంగాదు.

ప్ర: అల్లుడు కష్టపెట్టాడనుకుంటే బుద్ధి చెప్పాలిగాని, వాడినిదించి బిడ్డకి ఇంకొకణ్ణి కట్టబెట్టడమా?

అ: ప్రస్తుతం ప్రజలు అన్నమో లక్ష్మణా యని అలమటించుతూంటే చూచి సహించలేని మాపార్టీ ప్రభుత్వమును చేబట్టి అందరికీ కూడు గుడ్డ సప్లయిచేయడానికే పూనుకున్నది. ఇప్పుడు చూడండి, కూలివారికి కూలిచాలదు. ఇచ్చిన కూలితో పొట్ట గడవకపోగా ఆ సగం అన్నం గూడా లభించడం కష్టమైంది.

ప్ర: మీరు చెప్పడం సరే. ఇప్పటి ప్రభుత్వం చేయలేదని దుమ్మెత్తి పోస్తున్నారుగాని మీరెంతకాలంలో మీరు చెప్పిన ఫలితం చూపిస్తారు? కొంతకాలంవరకు సర్దుబాటు చేయడానికి టైము కావాలంటూరా? ఎన్నిదినములు లేక యెన్నిమాసములు? మీరు చెప్పిన టైము వరకైనా ప్రజలు ఇప్పటి కష్టాలు పడాలిగా? అప్పుడు మీరు చేయలేకపోతే విచారణ లేకుండా వురిదీయడంగాని, ద్వీపాంతరవాసంగాని, జన్మాంత కఠినశైటుగాని అనుభవించడానికి వప్పుకుంటూరా? అట్లా చేయకపోతే వురిశిక్షకే పాల్పడతామని హామీపత్రాలు వ్రాసి యివ్వండి. రెండవవారికి బుద్ధివచ్చి యిప్పటిలాగా కల్లబొల్లి కబుర్లు చెప్పేటందుకు రావడం మానుకుంటారు.

అ: మేం ప్రభుత్వమునకు రాగానే సాధ్యమైనంత కొద్దిరోజులలో ప్రజా సౌఖ్యము యేర్పాటుచేస్తాం. అందుకు తగిన శాసనాలు చేస్తాం. ప్రజలందరూ మాకు ఎంతగా తోడ్పడితే అంత శీఘ్రకాలములో అమలుపరచడానికి వీలుంటుంది. ఇప్పటి ప్రభుత్వం మద్యనిషేధం వగైరా చట్టాలుచేయడమేగాని అమలు పరచడం చేతగానిదై వున్నది.

ప్రజ: మీరు చెప్పే "మేజువాణీ కబుర్లు" సాధ్యమైనంత త్వరలో చేస్తామని, ప్రజలు సహకరించాలనీ, తర్వాత అమలు జరక్కపోతే ప్రజలు సహకరించలేదనీ చెప్పే వాటితో ప్రయోజనం లేదు. అదంతా ప్రజలను మోసగించడానికి చెప్పే కబురే గాని వేరు గాదు. ప్రజలలో నీతి వుంది. వారిలో వారే సర్దుబాటు చేసుకుంటూంటే మీరు దేనికి? అల్లుండ్లు మేసినట్లు మేస్తూండడానికా? ప్రజాసేవ చేస్తామని మోసగించి ప్రజలకేదో హక్కులున్నట్లు చెబితే తలకాయలు వూపుతూ కూర్చునే రోజులు గతించాయి. ప్రజా సేవకుల మని వుద్యోగాలు సంపాదించుకోడమే గాని వేరు లేదు. వయోజన వోటింగే నిజమైతే ప్రజలకే అన్ని హక్కులూ వుంటే ఖచ్చితమైన పూచీ పత్రములు వ్రాసియిచ్చి వోట్లు అడగవలసిందేగాని యింకొక విధంగా కోరడం బుద్ధితక్కువపనే. డబ్బుమీద కాంక్షలేకుండా ప్రజాసేవ

కొరకే మీరు వెళ్ళేది నిజమైతే, మీ ఆస్తి అప్పుల స్టేటుమెంటు యిచ్చి మరీ వెళ్ళండి. మీరు సీట్లు దిగే రోజుకు యింతకు మించి ఆస్తి వున్నదంటే గవర్నమెంటు లాక్కునే పద్ధతి యేర్పాటు చేస్తాం. అప్పుడు మీ ప్రజాసేవ బయటపడుతుంది. "ప్రజలు సహకరించడం లేదు. ప్రజలు తమ కోరికలు తెలుపడం లేదు" అనేవి కట్టిపెట్టి ప్రజలకు కావలసినవి తెలిసినవాడైతేనే అందుకు పూనుకోవాలిగాని లేకపోతే అర్ధణా గాజులు తొడుక్కొని యింట్లో కూచోడం మేలు.

మద్య నిషేధం అమలు జరగడానికి ప్రజలు సహకరించలేదని యిప్పటివాండ్లు చెప్పినారని మీరన్నారు. ఇకమీద మీరుగూడా ప్రజలు సహకరించలేదనే చెప్తారుగా. అసలు స్కీములోనే తప్పువుందని తెలుసుకుంటూ సర్దుబాటు చేసుకోవలసిన అవసరం వుంది. వారు చేయ చేయలేనిది మీరు చేస్తారనడం వట్టి బూటకం. కొంతకాలం పాలించి బలుపుసులుపులు తెలుసుకొని అనుభవం సంపాదించినవారే చేయలేనిది ముక్కు మొగం యెరుగకుండా కొత్తగా వచ్చే మీరు చేస్తారంటే నమ్మకం లేదు. గ్యారంటీ అవసరం.

ఈ ప్రశ్నలతో యికను జవాబు చెప్పడం కష్టమై గుడ్లు మిటకరిస్తూ ఆలోచిస్తున్నాడు మన క్యాండిడేటు. గుండెల్లో విమానాలు పరుగెత్తుతున్నాయి. జవాబు చెప్పిగాని కదలడానికి వీలు లేదు. పూచీఇస్తామా అంటే, పురిశిశువు యెవడు వొప్పుకుంటాడు? ఏదో యిదివరకు మాదిరే గదా నని బయలుదేరాము. ఇప్పుడు బయటపడటం యెట్లాగా? ఈ వూళ్ళలో మన పార్టీ మెంబర్లు పదిమంది అయినావుంటే బంధురీతిగానైనా వారిలో వారు పోగై కొంతమంది మనకు సపోర్టు యిచ్చేవారు. ఇక్కడ పార్టీలు లేనందున మన ఆటలు సాగడంలేదు, అందరూ గూడా వొక్క వ్యక్తిని యిన్ని మాటలంటూంటే బదులు మాట్లాడలేదు, ఇట్లాంటి సమయంలో నలుగురు రౌడీ వస్తాదులనైనా కూడా తెచ్చుకొంటే బాగుండేది. ఇప్పుడు యెట్లా మాట్లాడినా వొళ్ళు కాస్తుందేమో ననే కాడికి వచ్చింది. అయినా ఒక జవాబు చెప్పి చూద్దామని—

"అయ్యా! మీరు అడిగినవన్నియు సబబుగానే వున్నాయి. ఉరిశిక్షకు పూచీపత్రాలు వ్రాసియిచ్చేందుకు మా పార్టీ సమావేశం జరిపి వెంటనే తేలుస్తాము. దానికి బహుశా ఎవ్వరూ వొప్పుకోరనుకుంటాను. ఇదివరకు రోజులు మాదిరిగానే అనుకొని వచ్చాను. ఎవరో మీకు బాగా నూరిపోసినారు. ఆ మహానుభావుడికి చెయ్యెత్తి దణ్ణం పెట్టవచ్చు.

ప్ర: ఈ కబుర్లు పనికిరావు. మేము నైతిక కాంగ్రెసువాండ్లము. కాంగ్రెసులో అవినీతి ప్రబలిందనే కారణం చెబితే కుదరదు. పాలించే వాండ్లు పదిమందో యిరవైమందో బుద్ధి తక్కువ పని చేశారని యిన్నిలక్షలమంది ప్రజలంతా బుద్ధితక్కువ వాళ్ళంటారా? అట్లా అన్నందుకు మీనోటికి బుద్ధి చెప్పవలసివచ్చింది. మీ పార్టీ సమావేశము యిక్కడనే జరిపి తేల్చి చెప్పవలసిందేగాని యిక్కడినుంచి కదలడానికి వీలులేదు.

ఈ భాగంతో కథ అడ్డం తిరిగింది. ప్రాణాలతో బయటపడడం మేలనుకొన్నాడు. వూపిరుంటే వుప్పమ్ముకొని బ్రతుకవచ్చునని నిశ్చయం చేసుకొని చేతులు రెండూ జోడించి క్షమాపణ వేడుకొని యింతటితో మా పార్టీని రద్దు చేస్తున్నాను. ఇకమీద యిట్టిపనులు యెప్పుడూ యెక్కడా చేయనని పూచీకత్తు వ్రాసి సంతకం చేసి ప్రజలకు అందించి సెలవు పుచ్చుకుంటానని నిలబడ్డాడు. ప్రజలు "యథేచ్ఛం విహర" అని అతన్ని వదలిపెట్టి కరతాళధ్వనులు చేస్తూంటే నా గుండెలు కొట్టుకోసాగాయి. ఇదివరదాకా యం. యల్. ఏ. క్యాండిడేటుగా నిలవదలచుకొన్న నేను నా పార్టీనిగూడా రద్దు చేసి సద్దులేకుండా కూచోడానికే నిశ్చయించుకొన్నాను.

